క్లుప్తంగా

అందరి సహకారంతోనే కుష్టు నిర్మూలన



మాట్లాడుతున్న హెచ్ఏ బంగారుబాబు

పూసపాటిరేగ: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పూసపాటిరేగ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంటు గాడి బంగారుబాబు అన్నారు. మండలంలోని కొప్పెర్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలి అన్నారు. చికిత్స పొందకపోతే శాశ్వత అంగవైకల్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రగతి వాకర్స్ నూతన కార్యవర్గం



వాకర్స్ గవర్నర్‌తో ఎన్నికైన నూతన కార్యవర్గం

విజయనగరం: ప్రగతి వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. వాకర్స్ డిస్ట్రిక్ట్ – 102 గవర్నర్ కరోతు సత్యం సమక్షంలో జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్షునిగా దారపు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా నీలాపు అప్పలరాజురెడ్డి, ట్రెజరర్‌గా సూరంపల్లి కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

చిరు ధాన్యాల సాగుతో మేలు



సీతారామునిపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

నెల్లిమర్ల రూరల్: రబీ సీజన్‌లో చిరు ధాన్యాల సాగుపై అన్నదాతలు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి సూచించారు. మండలంలోని సీతారామునిపేట, రామతీర్థం గ్రామాల్లో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మొక్కజొన్న, రాగి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథస్వామి మాట్లాడుతూ రబీ సీజన్‌లో చిరు ధాన్యాలైన రాగి, సాములు, కొర్రలు వేసుకోవాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం గ్రామాల్లో ఆర్‌బీకేలను అందుబాటులోకి తీసుకువచ్చిందని సేవలను వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు, మాజీ సర్పంచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'నెల్లిమర్లలో పోరు బావుటా..' పుస్తకావిష్కరణ

నెల్లిమర్ల: నెల్లిమర్ల కార్మికోద్యమ చరిత్రలో అరవై రోజుల ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) ప్రస్థానాన్ని వివరిస్తూ రూపొందించిన 'నెల్లిమర్లలో పోరు బావుటా' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించనున్నారు. పట్టణంలోని అమరవీరుల భవన్‌లో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఆవిష్కరణ సభలో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. 1991 సెప్టెంబరు 30 నుంచి నవంబరు 30వ తేదీ వరకు 60 రోజుల పాటు చేసుకున్న పరిణామాలతో కూడిన పుస్తకాన్ని ఇఫ్టూ రాష్ట్ర కమిటీ రూపొందించినట్లు ప్రతినిధులు తెలిపారు.

మెరుగైన సేవలే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: జిల్లా ప్రజలకు 108 అంబులెన్సుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు సూచించారు. విజయనగరంలోని 108 కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి రోగిని రిఫర్ చేసినపుడు సంబంధిత అధికారులకు రోగి వివరాలు తెలియజేయడం కోసం ఒక గ్రూపును క్రియేట్‌చేసి అందులో పోస్టు చేయాలని చెప్పారు. వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలన్నారు. సమావేశంలో 108 వాహనసేవల జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనాయుడు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు రవి, షణ్ముఖ పాల్గొన్నారు.

కార్పొరేషన్ అంచనా బడ్జెట్ రూ.141,94,30,720

- 2023–24 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్ అంచనా బడ్జెట్
- మూల ధనముల రాబడి రూ.110.17 కోట్లు
- ఆర్థిక సంవత్సరం ముగింపు నిల్వ రూ.14.27 కోట్లు
- నగరంలో అభివృద్ధి పనుల కోసం రూ. 72.13 కోట్లు కేటాయింపు
- ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన కార్పొరేషన్ పాలకవర్గం





సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్లశ్రావణి, నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారీ బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో అక్షరాల రూ.141 కోట్ల 94 లక్షల 30వేల 720తో ప్రవేశపెట్టిన అంచనా బడ్జెట్‌ను కార్పొరేషన్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించింది. నూతన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్ సాధారణ, మూలధన ఖాతాల ముగింపు నిల్వను రూ.46,04,87,110గా ముగింపు చూపించగా... అదే మొత్తాన్ని ప్రారంభ నిల్వగా చూపించారు. అన్ని ఖాతా పద్దుల కింద సాధారణ, మూల ధనముల రాబడి రూ.110,17,39,161గాను, మొత్తం ఖర్చు రూ.141,94,30,720 లెక్కకట్టారు. ముగింపు నిల్వగా రూ.14,27, 95,551 మొత్తాన్ని చూపించారు. మొత్తం బడ్జెట్‌లో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.72.13 కోట్లు కేటాయింపులు చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో ఆదాయ, వ్యయాలపై డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కౌన్సిల్‌లో వివరించారు.

ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్దే ధ్యేయంగా 2023 – 24 సంవత్సరానికి సంబంధించి నూతన బడ్జెట్‌ను రూపకల్పన చేసి ఆమోదించటం జరిగిందన్నారు. మొత్తం రూ.141.94 కోట్ల వార్షిక బడ్జెట్‌ను సభ ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నగర అభివృద్ధికి అధికారుల రూపొందించిన వార్షిక బడ్జెట్ అభినందనీయంగా ఉందని అన్నారు. బడ్జెట్ ప్రజావసరాలను మెరుగుపరిచేందుకు, నగరాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ కార్పొరేషన్ హోదా దక్కించుకున్న తరువాత రెండవసారి ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సూచన సలహాలతో నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని మరింతగా అభివృద్ధి చేసి ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్లు బండారు ఆనందరావు, ముద్దాడ రమణి, మారోజు శ్రీనివాసరావు, పిన్నింటి కళావతి, కంటుభుక్త తవిటిరాజు మాట్లాడారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, ఏసీపీలు మధుసూదనరావు, అమ్మాజీరావు, డీఈఈ అప్పారావు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ముఖ్యాంశాలు:

- విజయనగరం మునిసిపాలిటీ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన తరువాత రెండవ సారి రూ.141.94 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది.
- ఈ బడ్జెట్‌లో సుమారు రూ. 72.13 కోట్ల నిధులు నగరంలో అభివృద్ధి పనులుకు కేటాయించగా.. రూ.10 కోట్ల సాధారణ నిధులతో కొత్తగా రోడ్లు వేయుటకు ఆమోదం తెలిపారు.
- రూ. 5.87 కోట్ల బీపీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించారు.
- రూ.10 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.
- రూ.1 కోటితో సచివాలయాల పక్కా భవనాలు నిర్మాణాల కోసం కేటాయింపులు చేశారు.
- రూ.2 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం
- రూ.1 కోటితో హార్టీకల్చర్, పట్టణ సుందరీకరణ నిమిత్తం నిధులు కేటాయించారు.
- రూ.5 కోట్ల సాధారణ నిధులతో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.
- రూ.1.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్, పార్కుల లైటింగ్, జంక్షన్‌లో లైటింగ్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.
- రూ.50 లక్షలతో పార్కులు, ప్లే గ్రౌండ్స్ అభివృద్ధి.
- రూ. 40 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం.
- రూ.1.50 కోట్లతో నీటి సరఫరా కొరకు పైప్ లైన్‌ల విస్తరణ.
- రూ.80 లక్షలతో కొత్తగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- రూ.1 కోటి అమృత్ 2.0 నిధులతో అభివృద్ధి పనులు కోసం బడ్జెట్‌లో పొందుపరిచారు.
- రూ.2 కోట్ల ఎల్ఆర్ఎస్ స్కీం నిధులతో అభివృద్ధి పనులు.
- రూ. 9 కోట్లతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులు చేపడతారు.
- రూ.87 లక్షల ప్లాన్ గ్రాంట్‌తో అభివృద్ధి పనులు.
- రూ.75 లక్షలతో కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాల అభివృద్ధి.
- రూ. 75 లక్షలతో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అభివృద్ధి పనులు.
- రూ.1 కోటితో కొత్త బోర్లు వేయుటకు కౌన్సిల్ తీర్మానించింది.

ఒకే రోజు మూడు సమావేశాలు

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం మంగళవారం ఒకే రోజు మూడు సమావేశాలు నిర్వహించింది. ముందుగా ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక సమావేశం ప్రారంభించగా... 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన అంచనాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం 12 గంటలకు 19 అంశాలతో కూడిన అజెండాను సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టగా రెండు అంశాలను తిరస్కరించారు. అనంతరం 12.30 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహించి ఒక అంశాన్ని ఆమోదించారు. సమావేశాల్లో ప్రజారోగ్య విభాగాధికారి సత్యనారాయణ తీరుపై కౌన్సిల్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో ప్లాస్టిక్ నియంత్రణ చర్యల్లో అవినీతికి పాల్పడటం సరికాదని హితవు పలికారు.



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



మక్కువ: మండలంలోని బంగారువలస గ్రామ రహదారి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచ్ శంబంగి హరికృష్ణ మంగళవారం శంకుస్థాపన చేశారు. కోన గ్రామం రహదారి నుంచి బంగారువలస గ్రామం వరకు ఏపీఆర్ఆర్‌పీ(ఆంధ్రప్రదేశ్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్) నిధులు రూ.1.38లక్షలు నిధులతో, 2.07కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మించనున్నారు. గతంలో కంకర రహదారి కావడంతో, పెద్ద పెద్ద గోతులు తయారై వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడేవారు. రహదారి పనులు పూర్తయితే బంగారువలస గ్రామస్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శంకర్రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న రంగునాయుడు

మంత్రి బొత్సకు వినతి



మంత్రి బొత్స సత్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న గాదె

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యా శాఖాధికారులు పాఠశాలలను సందర్శించి తగిన సమయం ఇచ్చి ఆ తరువాత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునేటట్లు చూడాలని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ నాయకుడు గాదె శ్రీనివాసులనాయుడు మంత్రి బొత్స సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు విశాఖపట్నంలోని మంత్రి నివాసంలో పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం కలిశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. భోగాపురం మండలం జగ్గయ్యపేటలోని అంగన్‌వాడీ కార్యకర్త, చినకొండ్రాజుపాలెంలో హెల్పర్, పూసపాటిరేగ మండలం పేరాపురంలో అంగన్‌వాడీ కార్యకర్త, కొత్తనడిపిల్లి, పెదబత్తివలసలో రెండు మిని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 10వ తేదీలోపు భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ తవిటినాయుడు తెలిపారు.

సఖి గ్రూపులను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

విజయనగరం: ప్రతీ సచివాలయ పరిధిలో సఖి గ్రూపులను ఏర్పాటు చేసి బాలికలలో సాధికారత తీసుకు రావాలని ఉమెన్ ప్రొటెక్షన్, హెల్త్ కార్యదర్శులకు కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నుంచి 21 ఏళ్లలోపు బాలికలకు సఖి గ్రూపుల యొక్క ఆవశ్యకత, అవసరం గురించి చైతన్యం తీసుకు రావాలన్నారు. ముఖ్యంగా బాలికలలో పౌష్టికాహార లోపం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌమార దశలో ఆరోగ్యపర సమస్యలు, లైంగిక వేధింపుల పట్ల బాలికలకున్న చట్టాలు వంటి విషయాలపై అవగాహన కల్పించి సఖి గ్రూపులుగా ఏర్పాటు చేయాలని చెప్పారు. తద్వారా సంపూర్ణ సాధికారత సాధించే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ఉమెన్ ప్రొటెక్షన్, హెల్త్ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది, టీమ్‌గా ఏర్పడి ప్రతి సచివాలయ పరిధిలో సఖి గ్రూపులను పెంపొందించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత కళాశాల విద్యార్థుల ప్రతిభ

- అంతర్జాతీయస్థాయిలో రాణింపు



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ రవిశంకర్

విజయనగరం టౌన్: విద్యలనగరం ఖ్యాతి అంతర్జాతీయ వేదికపై మార్మోగింది. వరల్డ్ ఫోరమ్ ఫర్ ఆర్ట్స్ అండ్ కల్చర్ సంస్థ గత ఏడాది జూలై 27న ఆన్‌లైన్‌లో నిర్వహించిన వివిధ కళా రంగాల పోటీల్లో మహరాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారు. మొత్తం 536 దేశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, కళాశాల విద్యార్థులు ఫోక్ డ్యాన్స్ విభాగం నుంచి థింసా నృత్యప్రదర్శనలో నృత్యప్రజ్ఞ అవార్డును సొంతం చేసుకున్నారు. బెంగళూరులో గత నెల 28న నిర్వహించిన విశ్వకళావేదికపై నృత్యప్రజ్ఞ అవార్డును ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురుదేవ్ రవిశంకర్, అతిథుల చేతుల మీదుగా అందుకున్నారు. యావత్ దక్షిణ భారతదేశంలోనే తమ కళాశాలకు అవార్డు దక్కడం ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పాలూరి గౌరీశ్వరరావు పేర్కొన్నారు. విద్యార్థులను అధ్యాపకులు డాక్టర్ శోభ బలగ, టి.రమణ, డాక్టర్ కన్నం నాయుడు, గంగాభవానీ, బి.సులోచన, ఎం.రమాగీతాదేవి తదితరులు అభినందించారు.

ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

భోగాపురం: జిల్లాలో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి, సివిల్ సప్లై డీఎం మీనాకుమారి అన్నారు. మండలంలోని పోలిపల్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని అన్నారు. మా పంచాయతీ పరిధిలో 700 టన్నుల వరకు ధాన్యం పండిందని, అందులో 350 టన్నుల వరకు మాత్రమే దాన్యాన్ని కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారని, మిగిలిన ధాన్యాన్ని మేము ఏవిధంగా అమ్ముకోవాలంటూ రైతులు అధికారులకు తెలియజేశారు. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యను జాయింట్ కలెక్టర్ దృష్టికి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, డీటీ శ్రీనివాసరావు, ఏఓ హరికృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.31.50 లక్షల రుణ సాయం



లబ్ధిదారులకు రుణ సహాయ పత్రాలను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ రుణాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం రూ. 31.50లక్షలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు 13 మంది లబ్ధిదారులకు మంగళవారం అందించారు. జెడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా రుణ మంజూరు పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జగదీష్, దివ్యాంగుల సంఘ నాయకుడు కొండబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైనది


- కలెక్టర్ సూర్యకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం ఫోర్ట్: వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని, ఆ వృత్తిని ఆస్వాదిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూర్యకుమారి వైద్యాధికారులకు సూచించారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఇటీవల నియమితులైన వైద్యులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చక్కటి చిరునవ్వుతో పలకరించడం ద్వారా రోగుల మనసును తేలిక చేయాలని సూచించారు. వైద్య పరమైన జాగ్రత్తలు తీసుకునేలా ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పనిని భారంగా కాకుండా ఇష్టంగా చేయాలని తెలిపారు. పేద ప్రజలకు వైద్య పరమైన సేవలందించడం అదృష్టంగా భావించాలని తెలిపారు. మనసుకు సంతృప్తి కలిగేలా పని చేయాలని పేర్కొన్నారు. వైద్య వృత్తిలో ఉన్న వారికి సమయపాలన, ప్రశాంతత అవసరమన్నారు. ప్రజలతో ప్రేమ పూర్వకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు చిన్న చిన్న కేసులను రిఫర్ చేయవద్దని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వామ్యం చేసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. స్థానిక పరిస్థితులు వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వి.రమణకుమారి, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డీఎంఓ డాక్టర్ ఎం.తులసి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జొన్నాడ పైడితల్లి జాతర





అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు, (ఇన్‌సెట్లో) ఆలయంలో భక్తుల పూజలు అందుకుంటున్న పైడితల్లి అమ్మవారు

డెంకాడ: భక్తుల కొంగు బంగారం, కోర్కెలు తీర్చే కల్పవల్లి జొన్నాడ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. డెంకాడ మండలంతో పాటు విజయనగరం, విశాఖ జిల్లా పద్మనాభం మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆ ప్రాంతం భక్తజనంతో కిటకిటలాడింది. అమ్మవారిని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు.

సేవలను వినియోగించుకోవాలి



దివ్యాంగులకు వైద్య పరీక్షలు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వం దివ్యాంగులకు అందించే అన్ని సేవలను వినియోగించుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు అన్నారు. స్థానిక కణపాక యూత్‌హాస్టల్‌లో సమగ్ర శిక్ష –విద్యా శాఖ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో–అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, హైదరాబాద్ వారి సౌజన్యంతో గ్రహణంమొర్రి, గ్రహణశూల బాధితులకు ఉచితవైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు వివిధ శాఖల ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వీటిని దివ్యాంగుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో నడుపబడుతున్న భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలను చేర్పించి వారికి మంచి భవిష్యత్ అందజేయాలని సూచించారు. ఈ శిబిరానికి హాజరైన దివ్యాంగులకు డాక్టర్ డి.ముకుందరెడ్డి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 11 మంది పిల్లలను గ్రహణంమొర్రి, గ్రహణ శూల, దంతాల అమరిక సంబంధించి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సహిత విద్య సహ సమన్వయకర్త ఎం.భారతి, ఆస్పత్రి ప్రతినిధి కె జోషి, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు

గుర్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వెంటనే గృహ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ త్రినాథరావు తెలిపారు. మండలంలోని చింతపల్లిపేట జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ము శ్రీదేవి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.